నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 ఖమ్మం, గురువారం 4 జనవరి 2024 BHADRADRI KOTHAGUDEM

## ఎర్రుపాలెంలో 'శాతవాహన' ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలి

**– కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు ఎంపీ నామా వినతి**


కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతి అందజేస్తున్న ఎంపీ నామా

ఖమ్మం, జనవరి 3: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని చారిత్రక జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రాన్ని పరిగణనలోకి తీసుకొని ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలని ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి వినతి అందించారు. జమలాపురం ఆలయాన్ని తెలంగాణ ప్రజలు చిన్న తిరుపతిగా భావిస్తారని, ఒక్క ఏడాదిలోనే సుమారు 10 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులు, యాత్రికులు స్వామి వారిని దర్శించుకుంటారని కేంద్ర మంత్రికి వివరించారు. ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉంటే ఎర్రుపాలెం నుంచి భక్తులు సులభంగా జమలాపురం చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని తాను 15, 17వ లోక్‌సభా సమావేశాల్లో ప్రస్తావించానని, రైల్వేశాఖ ఉన్నతాధికారులకు అనేకసార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. ఇప్పటికైనా శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు ఎర్రుపాలెంలో హాల్టింగ్ ఇచ్చేలా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## కేటీఆర్‌ను కలిసిన వైరా మాజీ ఎమ్మెల్యే

కొణిజర్ల, జనవరి 3 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాములునాయక్

# బడి బయట పిల్లలెందరు..?

- ఈ నెల నుంచి 10 వరకు కొనసాగనున్న ఇంటింటి సర్వే
- బడి బయట పిల్లల వివరాల సేకరణ
- ఇప్పటి వరకు 173 మంది గుర్తింపు
- గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా 111 మంది సీఆర్పీల సర్వే


సర్వేను పరిశీలిస్తున్న ఏఎంవో

ఖమ్మం, జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ ఏటా సర్వే నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం సర్వే కొనసాగుతున్నది. సీఆర్పీలు ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ గత నెల 6న సీఆర్పీలతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. అలాగే ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో గత నెల 8న ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి సర్వేపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫో, ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ నెల 10వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం సర్కార్ పాఠశాలల్లో విద్యార్థుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించాలని, ఏ ఒక్క విద్యార్థీ బడి బయట ఉండకుండా చూడాలన్నారు. సర్వే జరుగుతున్న తీరును ప్రతి రోజు సెక్టోరల్ అధికారులు పర్యవేక్షణ చేయడంతోపాటు వారి నుంచి డీఈఓ వివరాలు సేకరిస్తున్నారు.

### నెల రోజులపాటు సర్వే...

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో అర్బన్, రూరల్ ప్రాంతాల వారీగా సీఆర్పీలు సర్వే చేపడుతున్నారు. సర్వేలో 6 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 19 సంవత్సరాలలోపు బడి బయట బాల బాలికలను గుర్తిస్తున్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అసలు బడిలో చేరకుండా, బడిలో చేరి కూడా 30 రోజులకు పైగా గైర్హాజరవుతున్న బాలలను గుర్తిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 81 పాఠశాల సముదాయాల పరిధిలో మొత్తం 111 సీఆర్పీలు సర్వే చేపడుతున్నారు. నవంబర్ 1వ తేదీ నుంచి వరుసగా 30 రోజులుగా హాజరు కాని 108 మంది లాంగ్ డ్రాపౌట్స్‌ను గుర్తించారు. వారిని కూడా తిరిగి పాఠశాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### ఇప్పటివరకు 173 మంది గుర్తింపు..

జిల్లాలోని 21 మండలాల పరిధిలో ప్రస్తుతం సర్వే జరుగుతున్నది. సీఆర్పీలు జిల్లావ్యాప్తంగా 173 మంది బడి బయట పిల్లలను గుర్తించారు. వీరిలో 6-14 సంవత్సరాల లోపు పిల్లలు 88 మంది ఉన్నారు. వీరిలో బాలురు 48 మంది. బాలికలు 40 మంది. 15 నుంచి 19 సంవత్సరాలలోపు బడి బయట పిల్లలు 85 మంది ఉన్నారు. వీరిలో బాలురు 57 మంది. బాలికలు 28 మంది.

### సీఆర్పీల ఆధ్వర్యంలో సర్వే..



డిసెంబర్ 11వ తేదీ నుంచి జిల్లాలో బడి బయట పిల్లలను గుర్తించే సర్వే ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు సర్వే కొనసాగుతుంది. కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ సర్వే చేపడుతుండగా, సర్వేను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, మండల విద్యాధికారులు పర్యవేక్షిస్తున్నారు. సర్వే తర్వాత బడి ఈడు పిల్లలను బడికి పంపించేలా చర్యలు తీసుకుంటున్నాం.

**– రవికుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి, ఖమ్మం**

### బాలబాలికలు బడిలో ఉండేలా..



జిల్లాలో ఉన్న బడి బయట పిల్లల వివరాలు సేకరించేందుకు 111 మంది సీఆర్పీలతో సర్వే చేయిస్తున్నాం. సర్వే ముగిసే నాటికి గుర్తించిన పిల్లలను బడికి పంపించేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాశాఖ పరిధిలోని అన్నిస్థాయిల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. నూరుశాతం లక్ష్యం సాధించే దిశలో ముందుకు వెళ్తున్నాం.

**– సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం**


సర్వేలో బడి బయట పిల్లల వివరాలు నమోదు చేస్తున్న సీఆర్పీ

### ఇంటింటికీ వెళ్లి సర్వే...

బడి బయట పిల్లలను గుర్తించేందుకు సీఆర్పీలు ఇంటింటికీ వెళ్తున్నారు. సర్వేలో గుర్తించిన పిల్లలను వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నది. సదరు బాలబాలికలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తుంది. లేదా కేజీబీవీలో చేరేందుకు అర్హత ఉన్న బాలికలను అక్కడ చేర్పించారు. 2022 సర్వేలో విద్యాశాఖ 6-14 ఏళ్లలోపు బాలబాలికలను 79 మంది, 15-19 ఏళ్లలోపు బాలబాలికలను 122 మందిని గుర్తించింది. వీరిలో 39 మందిని పాఠశాలల్లో చేర్పించింది. మిగిలిన వారు పాఠశాల వయస్సు పైబడిన వారు కావడంతో వారు ఓపెన్ స్కూల్‌లో చదువు కొనసాగించే విధంగా ప్రోత్సహించింది.

## సీతారామ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

**తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు నీరు ఇవ్వాలి**

**అవసరమైతే ఆధునిక సాంకేతికతను వినియోగించండి**

**ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

**గండుగులపల్లిలో ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష**


సీతారామ ప్రాజెక్ట్ 4వ పంప్‌హౌజ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 3 (నమస్తే తెలంగాణ)/అశ్వారావుపేట: సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం ఆయన ఖమ్మం, భద్రాద్రి జిలాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆలతో కలిసి భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి సమీపంలోని ప్రాజెక్ట్ 4వ పంప్‌హౌజ్ పనులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు అంశాలపై సూచనలిచ్చారు. తక్కువ ఖర్చుతో నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ ద్వారా ఎక్కువ ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణ అంచనా రూ.13,500 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రికి ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికి మూడు పంప్‌హౌజ్‌ల నిర్మాణం పూర్తి చేశామని, త్వరలో 4వ పంప్ హౌజ్‌ను కూడా పూర్తి చేస్తామన్నారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. టన్నెల్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఆ పనుల్లోనూ వేగం పెంచాలని ఇరిగేషన్ సీఈకి సూచించారు. అవసరమైతే అత్యాధునిక సాంకేతిక యంత్రాలను వినియోగించాలన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయితే సత్తుపల్లి ట్రంక్, లంకాసాగర్ ప్రాజెక్టుకు నీరు అందే అవకాశం ఉంటుందన్నారు. మిగిలిపోయిన భూసేకరణ, అటవీ అనుమతులు వంటి పనులతోపాటు జెన్‌కో పవర్ హౌజ్ టెండర్ ప్రక్రియను సత్వరం పూర్తి చేయాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది వర్షాకాలం నాటికి వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు గోదావరి జలాలను అందించాల్సి ఉంటుందన్నారు. జలాలు వస్తే ఇక రైతులు నాగార్జున సాగర్ జలాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. ఉభయ జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ ఏడాది 1-1.5 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తే వచ్చే ఏడాది మరో 1-1.5 లక్షల ఎకరాలకు జలాలు అందివ్వొచ్చన్నారు. ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 6.74 లక్షల ఎకరాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించవచ్చన్నారు. మంత్రి పర్యటనలో ఇగిరేషన్ ఎస్ఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఈఈలు అర్జున్, శ్రీనివాస్, సురేష్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపాలన

**ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్**


13వ వార్డులో కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న కమిషనర్ సుజాత

సత్తుపల్లి, జనవరి 3: సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్రప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నదని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సత్తుపల్లి పట్టణంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా అధికారులే ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 407 గ్రామపంచాయతీలు, పట్టణాల పరిధిలోని 60 వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించామన్నారు. ప్రజల నుంచి 1.99 లక్షలకు పైగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రజలు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు జత చేస్తే సరిపోతుందన్నారు. ఇక ఏ విధమైన ఇతర ధ్రువపత్రాలు అవసరం లేదన్నారు. దరఖాస్తుదారులు దరఖాస్తు ఇచ్చిన తర్వాత తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, ఫిషరీస్ ఏడీ ఆంజనేయ స్వామి, డీఆర్డీవో విద్యాచందన, ఆర్డీవో అశోక్‌చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ సుజాత ఉన్నారు.

## ఖమ్మం సీపీగా సునీల్‌దత్


సీపీ సునీల్ దత్


ఎస్పీ రోహిత్‌రాజు

ఖమ్మం, జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్(సీపీ)గా సునీల్‌దత్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఖమ్మం సీపీగా పనిచేస్తున్న విష్ణు ఎస్ వారియర్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. గతంలో సునీల్‌దత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తుండగా ఖమ్మానికి బదిలీపై రానున్నారు. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించే సమర్థవంతమైన అధికారిగా సునీల్‌దత్‌కు పేరుంది. ఆయన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా 2018 సెప్టెంబర్ 11 నుంచి 2022 జూలై 4వ తేదీ వరకు పనిచేశారు. అంతకుముందు భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన సునీల్‌దత్ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపారు. ఖమ్మం సీపీగా విష్ణు ఎస్ వారియర్ 6 ఏప్రిల్ 2021న బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపారు. జిల్లాలో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో కీలకంగా వ్యవహరించారు. గతేడాది గోదావరి వరదల నేపథ్యంలో భద్రాచలంలో బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో కీలకపాత్ర పోషించారు. బూర్గంపాడు ప్రాంతంలో వరదల సమయంలో ప్రత్యేక బోటు ద్వారా పయనించి వివిధ ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులను రక్షించారు. ఖమ్మం సీపీగా సునీల్‌దత్ రెండ్రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### భద్రాద్రి ఎస్పీగా రోహిత్‌రాజు

**మాదాపూర్ డీసీపీగా డాక్టర్ వినీత్ గంగన్న**

కొత్తగూడెం క్రైం, జనవరి 3 : పోలీస్ ఉన్నతాధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎస్పీగా బిరుదరాజు రోహిత్ రాజును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ వినీత్ గంగన్నను మాదాపూర్ డీసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్‌కు చెందిన రోహిత్ రాజు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించే తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని 2018లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. 2020లో జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌గా అడుగుపెట్టిన రోహిత్ రాజు కరోనా సమయంలో తనదైన శైలిలో విధులు నిర్వర్తించి ప్రత్యేకతను చాటుకున్నారు. జిల్లాలోనే పలుచోట్ల ప్రొబేషనరీ కాలంలో విధులు నిర్వర్తించిన అనంతరం గ్రేహౌండ్స్‌కు బదిలీపై వెళ్లారు. కొత్తగూడెం సబ్ డివిజన్‌లో ప్రొబేషనరీ కాలంలో లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, బంగారుచెలక, మైలారం వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ, గిరిజనులకు సుపరిచితుడయ్యారు. 2021లో తిరిగి జిల్లాలోని భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2022లో జరిగిన బదిలీల్లో పాల్వంచ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నాగ రామకృష్ణ కుటుంబం ఆత్మహత్య కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిపి ఈ కేసులోని నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరి ప్రత్యేక మార్క్ వేసుకున్నారు. పాల్వంచ ఏఎస్పీగా ఉంటూనే భద్రాచలం, కొత్తగూడెం ఏఎస్పీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. భద్రాచలం ఏఎస్పీగా పని చేసిన ఆయన ఉన్నతాధికారుల సూచనలతో మావోయిస్టుల చర్యలను తిప్పికొట్టడంలో సిద్ధహస్తులయ్యారు. పాల్వంచ ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఉద్యోగోన్నతి పొందిన రోహిత్ రాజు హైదరాబాద్ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా విధులు పూర్తి చేశారు. 2023 జరిగిన బదిలీల్లో భాగంగా హైదరాబాద్ సౌత్-ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ అయి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వర్తించారు. తాజా బదిలీల్లో రోహిత్ రాజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీగా బదిలీపై రానున్నారు.

# జోరుగా పత్తి విక్రయాలు

- సీసీఐ కేంద్రాల వద్ద విక్రయానికి బారులు
- ప్రైవేటు కేంద్రాల్లో క్యాష్ అండ్ క్యారీ..
- బయట అమ్మకానికే మొగ్గు చూపుతున్న రైతులు


సుజాతనగర్‌లో ప్రైవేటు ట్రేడర్స్ కొనుగోలు చేసిన పత్తి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని సబ్ మార్కెట్లలో పత్తి విక్రయాలు జోరందుకున్నాయి. మద్దతు ధర ఉన్నా సీసీఐ కేంద్రాల వద్ద పత్తి విక్రయాలకు రైతులు క్యూ కడుతుండడంతో అధికారులు పలు నిబంధనలు విధిస్తున్నారు. దీంతో రైతులు చేసేది లేక ప్రైవేటు కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్ముతున్నారు. తెల్లవారకముందే సరుకును తీసుకొని కొనుగోలు కేంద్రాలకు వెళ్లినా సాయంత్రం వరకు క్యూలోనే ఉండాల్సి వస్తున్నదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేసినా విక్రయాలకు పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట విక్రయించడం చాలా సులువు కావడంతో రైతులు సబ్ మార్కెట్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలోని నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు 1,73,980 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా.. సబ్ మార్కెట్‌లో 86,500 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. జూలూరుపాడు మండలంలోని సబ్ మార్కెట్‌లో కూడా పత్తి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**బయట క్యాష్ అండ్ క్యారీనే..**

సబ్ మార్కెట్లలో పత్తి విక్రయాలకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో ఇబ్బంది లేకుండా తమ సరుకును విక్రయిస్తున్నారు. పత్తి లోడు వచ్చిందంటే చాలు ట్రేడర్ వాహనం దగ్గరకే వచ్చి కాంటా వేసి వెంటనే సొమ్ము చెల్లించడంతో రైతులు చకచకా విక్రయాలు చేస్తున్నారు. దీంతో బయట విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి ఆధార్ కార్డు, కూపన్ లేకుండానే విక్రయాలు జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు లేకుండా అమ్ముకుంటున్నారు.

### నిబంధనలు తప్పనిసరి



ప్రభుత్వం అంటే సీసీఐ క్వింటా రూ.7,020 ధర వరకు ఉంది. బయట రూ.6,500 చొప్పున కొంటున్నారు. సీసీఐలో క్వాలిటీ పత్తిని మాత్రమే తీసుకుంటారు. ఎక్కువ మంది రైతులు రావడం వల్ల ఆలస్యంగా కావడం సహజమే. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయాలు చేపడుతున్నాం. సరుకు కొనుగోళ్లపై మార్కెటింగ్ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. చెక్‌పోస్టుల వద్ద కూడా నిఘా పెంచాం.

**– అలీం, జిల్లా మార్కెటింగ్ అధికారి**


డేగలమడుగు సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

## సింగరేణిని దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలుపుదాం : సీఎండీ బలరాం



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణిని దేశంలోనే మేటి సంస్థగా నిలుపుదామని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుధవారం ఓ ప్రకటనలో సింగరేణీయులకు పిలుపునిచ్చారు. సింగరేణీయులు కష్టపడి పనిచేసి సంస్థ పరిధిలో మరిన్ని థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు విస్తరింప జేయాలన్నారు. రాష్ట్రంలోని థర్మల్, విద్యుత్ కేంద్రాలన్నింటికీ బొగ్గు కొరత లేకుండా సరఫరా చేయడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. గనుల్లో ప్రతిఒక్కరూ రక్షణ నియమాలను పాటించాలన్నారు. సీఎండీగా అవకాశం ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఆయనకు సింగరేణి మాజీ డైరెక్టర్ (పా) పవిత్రన్‌కుమార్, ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్, సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ చైర్మన్, కోలిండియా డైరెక్టర్ (టెక్నికల్) వీరారెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, ఈడీ కోల్‌మైమెంట్ ఆల్విన్, జీఎం (కో-ఆర్డినేషన్) ఎం.సురేశ్, జీఎం (సేఫ్టీ) గురవయ్య, సింగరేణి అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్వీకే రాజశేఖర్‌రావు అభినందనలు తెలియజేశారు.

### రాములోరి హుండీ ఆదాయం రూ.1.51 కోట్లు


సొమ్మును బ్యాంకు ఉద్యోగికి అందజేస్తున్న ఈవో

భద్రాచలం, జనవరి 3 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించగా రూ.1.51 కోట్లు వచ్చాయని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. అదేవిధంగా 92 గ్రాముల బంగారం, కిలోన్నర వెండి, 352 అమెరికన్ డాలర్లు, రూ.1.10 లక్షల ఇండోనేషియా రూపాయలు, 100 ఖతర్ రియాల్స్, 125 అరబ్ ఎమిరేట్స్ ధీరమ్స్, 200 ఒమన్ బైస, 10 నేపాల్ రూపాయలు, 10 యూకే యూరోలు, 20 థాయ్‌లాండ్ బాత్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 13 నుంచి జనవరి 2వరకు ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు జరగడంతో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

### రామయ్యకు వైభవంగా రాపత్తు సేవ


శేష వాహనంపై స్వామివారిని తీసుకొస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 7 : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారికి రాపత్తు సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అందంగా అలంకరించి శేష వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ భక్తరామదాసు నిర్మించిన దసరా మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, డాక్టర్ బీ సుబ్బరాజు, ఎస్ఎన్వీ రామారావు, పీ రమేశ్ పాల్గొన్నారు.

## 'ఆటోవాలాల కడుపులు కొట్టొద్దు'


ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రం క్రాస్‌రోడ్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఆటోల యజమానులు

కారేపల్లి, జనవరి 3: 'రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేస్తూ మా కడుపు మీద కొడుతుంది..' అని ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రానికి చెందిన ఆటోవాలాలు బుధవారం ఖమ్మం- ఇల్లెందు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో తమ ఆదాయం పూర్తిగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లలో ఎక్కువ మంది ఫైనాన్స్‌పై ఆటో తీసుకున్న వారేనని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం కిస్తీలు కూడా కట్టలేకున్నామని వాపోయారు. ఫ్రీ బస్ పథకంపై రాష్ట్రప్రభుత్వం పునరాలోచన చేయాలని వేడుకుంటున్నారు. కుటుంబ పోషణ భారంగా ఉందని, పిల్లలను చదివించుకోలేకపోతున్నామని అన్నారు. రాస్తారోకోలో ఆటో యజమానులు ప్రభాకర్, శ్రీను, రవి, నాగయ్య, పండు, ప్రసాద్, ఖాదర్, సాగర్, సందీప్, కృష్ణ, బాలు, కుమార్, బిట్టు, యాకూబ్‌పాషా, సత్తి పాల్గొన్నారు.